క్లుప్తంగా

వెండి కిరీటం బహూకరణ



ఆలయ చైర్మన్‌కు కిరీటం అందజేస్తున్న దాతలు

పాతపట్నం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం పాతపట్నం నీలమణిదుర్గ అమ్మవారికి పాతపట్నంకు చెందిన సోపింటి అప్పారావు, కిరణ్ కుమార్, హోషిధర్‌లు వెండి కిరీటాన్ని ఆలయ కమిటీ చైర్మన్ నూలు ఈశ్వరరావుకు శుక్రవారం బహూకరించారు. వెండి కిరీటం 756 గ్రాములు ఉంటుందని దాతలు తెలిపారు. పీఏసీఎస్ అధ్యక్షుడు ఎం.శ్యామ్‌సుందరరావు, ఆలయ కమిటీ సభ్యులు నేతాజీ, సుదర్శన రావు, వేణుగోపాలరావు, సంతోష్ కుమార్, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ స్థలాల పరిశీలన



ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న తహసీల్దార్, తదితరులు

నరసన్నపేట: మండలంలో ప్రధాన రహదారులు, నియోజకవర్గ కేంద్రం నరసన్నపేట చుట్టూ ఉన్న ప్రభుత్వ స్థలాలను పరిశీలించి గుర్తిస్తున్నామని తహసీల్దార్ ఎ.సింహాచలం తెలిపారు. జమ్ము జంక్షన్‌తోపాటు జాతీయ రహదారికి ఆనుకుని ఉన్న స్థలాలను శుక్రవారం పరిశీలించారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగా ప్రభుత్వ స్థలాలను గుర్తించి మార్కింగ్‌లు చేస్తున్నామన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈ ప్రక్రియ నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆర్ఐ అన్వేష్, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఆర్‌బీకేలకు చేరిన ఎరువులు



యంబరాం రైతు భరోసా కేంద్రానికి చేరుకున్న ఎరువులు

ఎల్.ఎన్.పేట: ఈ ఏడాది ఖరీఫ్ వరిసాగుకు సంబంధించిన ఎరువులు రైతు భరోసా కేంద్రాలకు చేరుకున్నాయని ఏఓ పైడి లతశ్రీ చెప్పారు. మండలంలోని 12 ఆర్‌బీకేల్లో ఒక్కొక్క ఆర్‌బీకేకి 20 మెట్రిక్ టన్నుల యూరియా, 20 మెట్రిక్ టన్నుల డీఏపీ ఎరువు వచ్చిందని తెలిపారు. ఎరువులు కావలసిన రైతులు ఆధార్, పట్టాదారు పాస్ పుస్తకం తీసుకుని ఆర్‌బీకేల్లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు. ఎరువులు కోసం అందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. ఎంత ఎరువు కావాలన్నా సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.


క్రికెట్ టోర్నీ ప్రారంభం



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న సర్పంచ్

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో నియోజకవర్గస్థాయి క్రికెట్ టోర్నమెంట్ శుక్రవారం ప్రారంభమైంది. కాకర్ల రవి జ్ఞాపకార్థం అంబేడ్కర్ యూత్ ఆధ్వర్యంలో ఈ టోర్నీ జరుగుతుంది. నియోజకవర్గం నలుమూలల నుంచి 24 జట్లు పాల్గొంటుండగా.. పోటీలను నరసన్నపేట సర్పంచ్ బూరల్లి శంకర్ ప్రారంభించారు. నాకౌట్ పద్ధతిలో టోర్నీ నిర్వహిస్తున్నామని చెరో జట్టు 8 ఓవర్లు ఆడుతున్నారని, ఫైనల్ ఆదివారం నిర్వహిస్తామని అంబేడ్కర్ యూత్ ప్రతినిధులు రాకేష్, రాము, జయవర్ధన్ తెలిపారు. టోర్నీ సజావుగా నిర్వహించేందుకు క్రీడాకారులు సహకరించాలని కమిటీ ప్రతినిధులు కోరారు.

లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరం



అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

బూర్జ: మండలంలోని తోటవాడ గ్రామంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలపై హెల్త్ సిబ్బంది ఆధ్వర్యంలో అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలు చేయించుకోవడం చట్టరీత్యా నేరమని, లింగ నిర్ధారణ చేసినా, చేయించుకున్నా కఠిన చర్యలు ఉంటాయన్నారు. వైద్య సిబ్బంది, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

- గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాతపట్నం ఎమ్మెల్యే రెడ్డి శాంతి



బైరాగిపేటలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే రెడ్డి శాంతి

పాతపట్నం: నాలుగేళ్లలో ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాల ద్వారా చేకూర్చిన ప్రయోజనాన్ని ప్రజలకు తెలియజేయాలని ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలోని బైరాగిపేట గ్రామంలో శుక్రవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎమ్మెల్యే నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నాయా, లేదా అని అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ పథకాల ద్వారా చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజల నుంచి సమస్యలను ఎమ్మెల్యే అడిగి తెలుసుకున్నారు. ప్రతీ ఇంట్లో కుటుంబ సభ్యులకు చేకూర్చిన ప్రయోజనాన్ని వివరిస్తూ సీఎం జగన్ రాసిన లేఖను ఆ కుటుంబాలకు అందజేశారు. రాజకీయాలకు అతీతంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికి దక్కుతుందన్నారు. రానున్న ఎన్నికల్లో మరోసారి జగనన్న ముఖ్యమంత్రిని చేయాలని కోరారు. మండల సచివాలయ కన్వీనర్ సూర్యం, ఎంపీటీసీ కొప్పల గీత, వైఎస్సార్‌సీపీ నాయకుడు ప్రవీణ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై డిప్యూటీ కలెక్టర్ విచారణ



కొత్తూరు ఎంఎల్ఎస్ పాయింట్‌లో విచారణ చేస్తున్న డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ అంబరీష్

కొత్తూరు: మండలం నుంచి పలు సమస్యలపై వచ్చిన ఫిర్యాదుల మేరకు ప్రొహిబిషన్ డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ అంబరీష్ శుక్రవారం విచారణ చేపట్టారు. ముందుగా కొత్తూరు మండల కేంద్రంలోని ఎంఎల్ఎస్ పాయింట్‌ను పరిశీలించారు. గత ఏడాది సుమారు రూ.కోటి విలువ చేసే నిత్యావసర సరుకులు మాయం కావటంపై అప్పట్లో వచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. ఈ సంఘటనపై ఎంఎస్ఎస్ పాయింట్‌ను డిప్యూటీ కలెక్టర్ పరిశీలించారు. పనిచేస్తున్న సిబ్బంది, కలాసీలను అడిగి వివరాలు తెలుసుకున్నారు. సంబంధించిన రికార్డులు అందుబాటులో లేవు. అనంతరం ఓంద్రుజోల రేషన్ డీలర్ అక్రమాలకు పాల్పడుతున్నారని టెక్కలి సబ్ కలెక్టర్‌కు వచ్చిన ఫిర్యాదు మేరకు ఓంద్రజోల గ్రామ సచివాలయంలో రేషన్ కార్డు దారులతో విచారణ చేపట్టారు. అక్రమాలు జరిగినట్లు రుజువైతే డీలర్‌పై చర్యలు తప్పవన్నారు. మండలంలోని కురిగాం రెవెన్యూ గ్రూపులో భూములు రీసర్వేలో రైతుల పేర్లు తప్పుగా నమోదైనట్లు జిల్లా కలెక్టర్‌కు రైతులు ఫిర్యాదు చేశారు. డిప్యూటీ కలెక్టర్ ఈ సంఘటనపై రైతులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. రైతులకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కుంటిబద్ర కాలనీలో సామాజిక భవనం నిర్మాణం కోసం స్థల వివాదంపై కాలనీ వాసులతో పాటు కొత్తూరు జెడ్పీటీసీ కామక భాగ్యలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్రినాథరావులతో మాట్లాడారు. సామాజిక భవనం మరో చోట నిర్మించాలని కాలనీ వాసులు కోరగా అందరికీ ఉపయోగపడేలా నిర్మాణం కోసం శంకుస్థాపన చేసిన స్థలంలోనే నిర్మించాలని జెడ్పీటీసీ కోరారు. తహసీల్దార్ పి.బాల, డీటీలు వెంకటరమణ, రవి, వెంకటరావు, ఆర్ఐ గిరీష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంఘాల భవిష్యత్తుకు ప్రణాళికలు సిద్ధం



సూచనలిస్తున్న ఏపీఎం కూర్మారావు

ఆమదాలవలస రూరల్: గ్రామీణ మహిళా సంఘాల ఉజ్వల భవిష్యత్తుకు ఉత్తమ ప్రణాళికలను తయారు చేసి అమలు చేయాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం పైడి కూర్మారావు అన్నారు. స్థానిక మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో అధ్యక్షురాలు తమ్మినేని ధనలక్ష్మి అధ్యక్షతన గ్రామీణ సంఘం అసిస్టెంట్లతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. వార్షిక వర్క్ ఫైనాన్స్ ప్లాన్ తయారుచేసుకుని, గ్రామంలో గల ప్రతీ మహిళా పొదుపు సంఘం విధిగా పాటించేలా అమలు చేయాలన్నారు. సమావేశాలు, పుస్తక నిర్వహణ, సొంత నిధుల సక్రమ వినియోగం గురించి సిబ్బంది ప్రణాళికను తయారు చేసుకోవాలన్నారు. 18 నుంచి 70 ఏళ్ల వయస్సు మధ్య గల మహిళలకు వారి అర్హతతో వ్యక్తిగత బ్యాంకు ఖాతా ద్వారా బీమా సౌకర్యం కల్పించాలన్నారు. జగనన్న గృహ నిర్మాణ పథకంలో లబ్ధిదారులందరికీ ఇళ్లు నిర్మించుకోవడానికి అవసరమైన పెట్టుబడి కోసం, అర్హత గల మహిళలందరికీ తాత్కాలిక రుణ సౌకర్యాన్ని కల్పించాలని సిబ్బందికి సూచించారు. మండల సమాఖ్య కార్యదర్శి వేణమ్మ, కోశాధికారి రేణుక, క్లస్టర్ కో ఆర్డినేటర్లు రమణ, చంద్రరావు, సుభద్ర పాల్గొన్నారు.

ట్రాక్టర్‌పై పడిన మామిడి కొమ్మ



ట్రాక్టర్ ఇంజిన్‌పై పడిన చెట్టు కొమ్మ

ఆమదాలవలస రూరల్: మండలంలో నిమ్మతొర్లాడ గ్రామం సమీపంలో గల ఇటుకల బట్టీల వద్ద మట్టి ట్రాక్టర్‌పై మామిడి చెట్టు కొమ్మలు విరిగిపడి కొత్తవలస గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ దవళ జితేంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. మండలంలో శుక్రవారం సాయంత్రం బలమైన ఈదురుగాలులు వీయడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే.. ఇటుక బట్టీల కోసం పొలం మట్టిని నిమ్మతొర్లాడ గ్రామం నుంచి సమీపంలో గల బట్టీల వద్దకు ట్రాక్టర్ ద్వారా మట్టిని డ్రైవర్ జితేంద్ర తరలిస్తున్నాడు. ఇటుక బట్టీ వద్ద ట్రాక్టర్‌ను నిలుపుదల చేసి మట్టిని అన్‌లోడ్ చేసే సమయంలో అకస్మాత్తుగా ఈదురుగాలులు రావడంతో పక్కనే ఉన్న మామిడి చెట్టు కొమ్మ ట్రాక్టర్ టాప్‌పై విరిగిపడింది. దీంతో డ్రైవర్ జితేంద్ర ఎడమ కాలికి తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108 సాయంతో శ్రీకాకుళంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు.

ఈదురుగాలులు.. చిరు జల్లులు



పాతపట్నం: పెంట్రోల్ బంక్ వద్ద నేలకొరిగిన విద్యుత్ డెకరేషన్ సెట్



కొత్తూరు: చల్లబడిన వాతవరణం

కొత్తూరు: మండలంలో గత రెండు రోజుల నుంచి సాయంత్రం వేళల్లో చిరుజల్లులు కురుస్తున్నాయి. శుక్రవారం సాయంత్రం వర్షం కురిసింది. దీంతో వాతవరణం చల్లబటంతో ప్రజలకు కొంత ఊరట కలిగింది.

మెళియాపుట్టి: భానుడి భగభగకు అల్లాడుతున్న ప్రజలకు శుక్రవారం కురిసిన వాన ఊరటనిచ్చింది. ఉదయం నుంచి ఉక్కపోత వాతావరణంతో ఇక్కట్లు పడిన మండల ప్రజలకు సాయంత్రం చల్లనిగాలులతో చినుకు పలకరించడంతో సేదతీరారు. మెళియాపుట్టితో పాటుగా పట్టుపురం, చాపర, కొసమాల తదితర గ్రామాల్లో మోస్తరు వర్షం కురిసింది.

పాతపట్నం: పాతపట్నం నీలమణిదుర్గ ఉత్సవాలకు ప్రధాన రహదారిపై విద్యుత్ అలంకరణ పనుల్లో భాగంగా భారీ కటౌట్‌లు ఏర్పాటు చేశారు. శుక్రవారం సాయంత్రం గాలులతో కూడిన చినుకులు పడడంతో అమ్మవారి ఆలయం సమీపంలో పెంట్రోల్ బంక్ వద్ద భారీ విద్యుత్ డెకరేషన్ సెట్ పడిపోయింది. ఆ సమయంలో వాహనాలు రాకపోవడంతో ప్రమాదం తప్పింది.

ఔదార్యం..



బాలుడి తండ్రికి రూ.65 వేలు నగదు అందజేస్తున్న ట్రస్టు సభ్యులు

కొత్తూరు: మండలంలోని కుంటిభద్ర కేంద్రంగా సేవలు అందిస్తున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు ఆపదలో ఉన్న ఇద్దరికి రూ.80 వేలు అందజేసి తమ ఔదార్యాన్ని చాటుకున్నారు. శ్రీకాకుళం జిల్లా ఎచ్చర్ల మండలం చిన్నకొంగరం గ్రామానికి చెందిన ఢిల్లేశ్వరరావు, కృష్ణవేణి దంపతులు ఐదు రోజుల క్రితం మగబిడ్డకు జన్మనిచ్చారు. పుట్టుకతోనే న్యూరో డిజార్డర్ లక్షణాలు ఉన్నందున వైద్యం కోసం విశాఖపట్నంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. చిన్నారి వైద్యానికి పెద్ద మొత్తం ఖర్చు అవుతుందని వైద్యులు తెలిపారు. నిరుపేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయం తెలుసుకున్న భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు విశాఖలోని ఆస్పత్రికి వెళ్లి చిన్నారి తండ్రికి రూ.65 వేల నగదను శుక్రవారం అందజేశారు. గార మండలం శ్రీకూర్మాం గ్రామానికి చెందిన జుగుపల్లి నాగు రోడ్డు ప్రమాదంలో కాలు, చేయి పొగొట్టుకున్నాడు. విశాఖపట్నంలో వైద్య పొందుతున్నాడు. తల్లిదండ్రులు నిరుపేదలు కావడంతో భగత్ సింగ్ ట్రస్టు సభ్యులు రూ.15 వేలు అందించారు.

సమయపాలన తప్పనిసరి

సారవకోట: సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించాలని డీఎల్‌డీఓ అలువేలు మంగమ్మ సూచించారు. మండలంలోని కేశవలస సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ ఉదయం బయోమెట్రిక్ వేసిన అనంతరం సచివాలయాలలో ప్రజలకు అందుబాటులో ఉండాలని, ప్రభుత్వం అందిస్తున్న సేవలన్నీ అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఎంపీడీఓ విశ్వేశ్వరరావు, సర్పంచ్ చిన్నాల సింహాచలం ఉన్నారు.

డబ్బులు వసూలు చేస్తే కఠిన చర్యలు

నరసన్నపేట: జల్ జీవన్ మిషన్ పథకంలో ఇంటింటికీ కుళాయిలు వేస్తున్నప్పుడు గృహ వినియోగదారుల నుంచి కొందరు డబ్బులు వసూలు చేస్తున్నట్లు తెలుస్తోందని, ఇలా చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, అవసరమైతే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉదయ్‌భాస్కర్ హెచ్చరించారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. నరసన్నపేటలోని మారుతీ నగర్, జయలక్ష్మీ నగర్, శ్రీరామనగర్‌లలో గత పది రోజులుగా ఇంటింటికీ కుళాయిలు గుత్తేదారు వేస్తున్నారని, గృహస్తుల నుంచి డబ్బులు వసూలు చేస్తున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయని తెలిపారు. ఎవరూ డబ్బులు ఇవ్వవద్దని సూచించారు. ఈ నెలాఖరు కల్లా పనులు పూర్తి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కాంక్రీట్ రోడ్లు కొన్నిచోట్ల తవ్వడం జరుగుతుందని, ఇతర నిధులతో తవ్విన రోడ్లను బాగు చేస్తామని తెలిపారు.

సైబర్ మోసాలపై అప్రమత్తం

ఆమదాలవలస రూరల్: సైబర్ మోసాల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని యూనియన్ బ్యాంక్ సీఎఫ్ఎల్ ఫీల్డ్ ఇన్‌చార్జి చిగురుపల్లి వెంకటేష్ అన్నారు. పట్టణంలో గల కృషి విజ్ఞాన కేంద్రంలో జరుగుతున్న కొబ్బరి చెట్లు ఎక్కే యంత్రాలపై అవగాహన సదస్సులో భాగంగా రైతులకు ఆర్థిక అక్షరాస్యతపై శుక్రవారం అవగాహన కల్పించారు. పొదుపు చేయడం ప్రతి ఒక్కరూ అలవాటు చేసుకుంటే అనవసర ఖర్చులు తగ్గి కుటుంబానికి ఎంతో ఆసరాగా నిలుస్తుందన్నారు. బ్యాంకుల్లో ప్రభుత్వ బీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఏటీఎం కార్డు వినియోగాలు, డిజిటల్ మోసాల గురించి వివరించారు. సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలని, ఫిర్యాదుల కోసం 1930, ఇంటిగ్రేటెడ్ అంబుడ్స్‌మెన్ టోల్ ఫ్రీ నంబర్ 14448ను వినియోగించుకోవాలని సూచించారు. ఉద్యాన శాస్త్రవేత్త హరికుమార్, రైతులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో ఆలయ వార్షికోత్సవం



కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

నరసన్నపేట: మండలంలోని లింగాలపాడులో అభయాంజనేయ స్వామి ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శుక్రవారం పలు పూజా కార్యక్రమాలను నిర్వహించారు. సాయంత్రం కుంకుమ పూజలు చేపట్టారు. మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. మూడు రోజులపాటు పూజాకార్యక్రమాలు చేపట్టనున్నట్లు కమిటీ సభ్యులు తెలిపారు.

నాడు-నేడు పనులు పూర్తిచేయాలి

హిరమండలం: నాడు-నేడు పథకంలో భాగంగా ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల అభివృద్ధి పనులు ఈనెలాఖరులోగా పూర్తిచేయాలని డీఈఈ డి.వి.ఎస్.మూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంఈఓ కె.రాంబాబు ఆధ్వర్యంలో హెచ్‌ఎంలు, సీఆర్పీలతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. నాడు-నేడు పనుల్లో ఈ మండలం వెనుకబడి ఉందన్నారు. పెండింగ్‌లో ఉన్న పనులు పాఠశాలల పునఃప్రారంభం నాటకి పనులు పూర్తిచేయాలన్నారు. నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మండల ఇంజినీర్ రామారావు, కొత్తూరు ఐసీడీఎస్ సీడీపీఓ విమలారాణి, ఏపీఎం శ్రీరాచంద్రమూర్తి, ఎమ్మార్సీ సిబ్బంది పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

బూర్జ: మండలంలోని బూర్జ-1, కాలపర్తి గ్రామాల్లో అంగన్‌వాడీ హెల్పర్ పోస్టులు భర్తీకి దరఖాస్తులు ఆహ్వానం పలుకుతున్నట్లు బూర్జ ఐసీడీఎస్ ప్రాజెక్టు పీఓ కె.శ్రీలత తెలియజేశారు. అర్హత గల ఓసీ అభ్యర్థులు ఈ నెల 25వ తేదీలోగా దరఖాస్తులను ఐసీడీఎస్ పీడీ శ్రీకాకుళం కార్యాలయానికి అందజేయాలని శుక్రవారం పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీన ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు తెలిపారు.

అమరావతిలో పేదలకు

పట్టాల పంపిణీ చేస్తాం



మాట్లాడుతున్న తమ్మినేని చిరంజీవినాగ్

- వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగం ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్

ఆమదాలవలస: ఎవరు ఎన్ని కుయుక్తులు పన్నినా అమరావతిలో పేదలకు ఇళ్ల పట్టాల పంపిణీ జరిగి తీరుతుందని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర యువజన విభాగ ప్రధాన కార్యదర్శి తమ్మినేని చిరంజీవి నాగ్ అన్నారు. ఆమదాలవలసలోని తన నివాసంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. పేదలకు సొంతింటి కల నెరవేర్చేలా చేయాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌హన్‌రెడ్డి సంకల్పిస్తే, దానిని స్వాగతించాల్సిన ప్రధాన ప్రతిపక్షం పట్టాల పంపిణీకి అడ్డుతగలడం తగదని దుయ్యబట్టారు. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు హయాంలో లబ్ధిదారుడికి 256 చదరపు అడుగులు స్థలాన్ని ఇస్తే, ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ సర్కార్ ప్రతీ లబ్ధిదారుడికి 440 చదరపు అడుగులను ఇచ్చేందుకు చర్యలు చేపట్టిందన్నారు. శవాన్ని పాతుకునేందుకు ఈ స్థలం సరిపోదు అంటూ చంద్రబాబు వ్యాఖ్యానించడం తగదన్నారు. ఆర్ -5 జోన్‌పై సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలతో పేదల ముఖాల్లో వెలుగులు నింపాయన్నారు. రాజధానిలో పేదలు వద్దని చెబుతున్న టీడీపీ నాయకులు ఏ ముఖం పెట్టుకుని ప్రజలకు ఓట్లు అడుగుతారని ప్రశ్నించారు. ప్రతిపక్షాల తీరు అన్యాయంగా ఉందని, ఒక రాజకీయ పార్టీగా టీడీపీ తన అర్హత కోల్పోయిందన్నారు. రాష్ట్రంలో 30 లక్షల మంది పేదలకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. చంద్రబాబు పేదలను విస్మరించి పెద్దలకు మాత్రమే మేలు చేశారని విమర్శించారు. ప్రతిపక్షాలకు ధన బలం ఉంటే, తమకు ప్రజాబలం ఉందన్నారు. మున్సిపల్ మాజీ ఫ్లోర్ లీడర్ బొడ్డేపల్లి రమేష్ కుమార్, వార్డు సచివాలయాల కో ఆర్డినేటర్ అల్లంశెట్టి ఉమామహేశ్వరరావు, మాజీ కౌన్సిలర్ దుంపల శ్యామలరావు, పొన్నాడ చిన్నారావు, ఎ.విజయ్‌కుమార్, బిట్టు, బి.రాజు పాల్గొన్నారు.

సంతృప్తికరమైన పరిష్కారం చూపాలి



సారవకోట: మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి జయరాజ్

సారవకోట: జగనన్నకు చెబుదాం కార్యక్రమానికి వచ్చిన వినతులకు సంతృప్తికరమైన పరిష్కారం ఇవ్వాలని మండల ప్రత్యేకాధికారి వి.జయరాజ్ సూచించారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో మండల స్థాయి అధికారులు, సచివాలయ సిబ్బందితో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ప్రజలు వివిధ సమస్యలపై పెట్టుకున్న అర్జీలను పూర్తిస్థాయిలో పరిశీలించాలన్నారు. తహసీల్దార్ ప్రవల్లికాప్రియ, ఎంపీడీఓ విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు అధిక ప్రాధాన్యత..

నరసన్నపేట: జగనన్నకు చెబుదాంకు వచ్చే ఫిర్యాదులపై అధికారులు వెంటనే స్పందించాలని నరసన్నపేట ప్రత్యేక అధికారి కె.కవిత సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో శుక్రవారం సమీక్ష నిర్వహించారు. ప్రతీ సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో విధిగా స్పందన కార్యక్రమం నిర్వహించాలని, అధికారులు అందరూ హాజరుకావాలని తెలిపారు. మండల పరిషత్ ఏఓ తిరుపతిరావు, ఏఓ కె.సునీత, ఐసీడీఎస్ పీఓ నాగమణి, ఎంఈఓ శాంతారావు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

జగనన్నకి చెబుదాంపై అవగాహన

పాతపట్నం: మండలంలో జగనన్నకి చెబుదాం కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సరైన పరిష్కారం వచ్చేలా మండల అధికారులు చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణకరరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు సమస్యలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. తహసీల్దార్ రవిచంద్ర, ఎంపీడీఓ జయంత్ ప్రసాద్, ఎస్ఐ కామేశ్వరరావు, ఏఓ అప్పలనాయుడు, ఈఓ పీఆర్డీ ప్రసాద్ పండా, అన్ని శాఖాధికారులు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు సత్కారం



గ్రామ వలంటీర్లను సత్కరించిన ఎంపీపీ, జెడ్పీటీసీ, అధికారులు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా గ్రామ వలంటీర్లు పనిచేస్తున్నారని ఎంపీపీ రెడ్డి జ్యోతిలక్ష్మి, జెడ్పీటీసీ కిలారి త్రినాథులు అన్నారు. బొర్రంపేట గ్రామ సచివాలయం వద్ద శుక్రవారం గ్రామ వలంటీర్ల సేవలకు వందనం కార్యక్రమాన్ని నిర్వహించారు. సేవా వజ్ర, సేవా రత్న, సేవా మిత్ర పురస్కారాలతో సత్కరించారు. ప్రభుత్వ పథకాలను అర్హులకు అందించటంలో వలంటీర్ల సేవ ఎంతో గొప్పదన్నారు. సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

మండల ప్రత్యేక ఆహ్వానితుడు రెడ్డి రామారావు, ఎంపీడీఓ ఆర్.కాళీప్రసాద్, ఎంపీటీసీ కింతలి చిరంజీవి, సర్పంచ్‌లు బొడ్డేపల్లి రమణమ్మ, యారబాటి గణపతి, ఈఓపీఆర్డీ జి.శ్యామలాదేవి, గ్రామ సచివాలయ కార్యదర్శి భారతి తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే ఇళ్ల నిర్మాణాలు వేగవంతం



మాట్లాడుతున్న డీఈ నర్సింగరావు

మెళియాపుట్టి: హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు సమన్వయంతో పనిచేసి జగనన్న ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలని గృహ నిర్మాణశాఖ డీఈ నర్సింగరావు అన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో సిబ్బందితో శుక్రవారం సమావేశమయ్యారు. గృహనిర్మాణాలాను వేగవంతం చేసి పూర్తిచేసే దిశగా ప్రతిఒక్కరూ పనిచేయాలన్నారు. ప్రభుత్వం నవరత్నాలలో భాగంగా పేదలందరికీ ఇళ్లు నిర్మించి ఇవ్వాలని ప్రతిష్టాత్మకంగా తీసుకుందన్నారు. దానికి అనుగుణంగా నిర్మాణ దశలనుబట్టి ఎంత సొమ్ము లబ్ధిదారులకు అందుతుందో వారికి అవగాహన కల్పించాలన్నారు. సోమవారం నాటికి మండల వ్యాప్తంగా జియోట్యాగింగ్ పూర్తిచేయాలన్నారు. గ్రామాలలో స్థానిక ప్రజాప్రతినిధులకు సమాచారం అందించి వారితో కలిసి ప్రజలతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతీశనివారం గృహనిర్మాణ దినోత్సవం నిర్వహించాలన్నారు. ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తిచేయాలని, నిర్మాణ దశలను పరిశీలించాలన్నారు. ఎంపీడీఓ పడాల చంద్రకుమారి మాట్లాడుతూ మండలంలో ఇటీవల 18 ప్రభుత్వ భవన నిర్మాణాలకు సంబంధించి బిల్లులు మంజూరయ్యాయని, వాటిని వేగవంతంచేసి పూర్తిచేయాలన్నారు. గృహనిర్మాణశాఖ ఏఈ శ్రీనివాసరావు, పీఆర్ ఏఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.